క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మెల్సీ తూమాటి



అసెంబ్లీలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్సీ తూమాటి

కందుకూరు: అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు కలిశారు. ఈ సందర్భంగా రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా ఏర్పాటు చేయదల్చిన ఎయిర్‌పోర్టు భూసేకరణ, ఇతర సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లగా..సానుకూలంగా స్పందించారని, త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

పీసీపల్లి: అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకొని మండల పరిధిలోని పడమటిపల్లిలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పొట్టిశ్రీరాములు సేవా సమితి నాయకులు తెలిపారు. నంద్యాలకు చెందిన శాంతిరామ్ మెడికల్ కాలేజీ, జనరల్ ఆసుపత్రి వారి సహకారంతో శిబిరం నిర్వహించనున్నట్లు సంఘ నాయకులు అన్నారంగనాయకులు, ఆరవీటి చిరంజీవి గుప్తలు తెలిపారు. వైద్యశిబిరంలో పరీక్షలు చేసి శుక్లాల ఆపరేషన్‌లు, మందులు ఉచితంగా అందజేస్తామన్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న కమిషనర్ మనోహర్

కందుకూరు అర్బన్: పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడాలని కమిషనర్ ఎస్. మనోహర్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, రెగ్యులేషన్ సెక్రటరీ, వెల్ఫేర్ సెక్రటరీ, మున్సిపల్ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. పన్నులపై ప్రజలకు అవగాహన కలిగించి నెలాఖరు నాటికి నూరుశాతం వసూలు చేయాలని ఆదేశించారు. మొండిబకాయిదారులకు మున్సిపల్ చట్టంప్రకారం రెడ్ నోటీసులు, కోర్టు నోటీసులు జారీ చేసి తాగునీటి కుళాయి కనెక్షన్లు తొలగించాలన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో ఆదాయం

జరుగుమల్లి(సింగరాయకొండ): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావడం ద్వారా పంచాయతీలు ఆదాయాన్ని సమకూర్చుకోవడానికి అవకాశం కలుగుతుందని ఎంపీడీఓ పి.రామకృష్ణ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. జరుగుమల్లి మండలం చింతలపాలెంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. కేంద్రంలో తయారైన 75 కేజీల వర్మీ కంపోస్టును కేజీ 20 చొప్పున రైతులకు విక్రయించాలని సూచించారు.

డాక్టర్ బత్తులను కలిసిన డాక్టర్ జీవన్



సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్ రెడ్డిని సింగరాయకొండలోని ఆయన నివాసంలో బుధవారం ఆ పార్టీ వైద్య విభాగం ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల జోనల్ అధ్యక్షుడు డాక్టర్ జీవన్ మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పదవి రావడానికి సహకరించిన బత్తులకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే అంశంపై చర్చించినట్లు డాక్టర్ బత్తుల వివరించారు.

225 పొగాకు బేళ్లు కొనుగోలు

కనిగిరి రూరల్: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం జరిగిన పొగాకు వేలంలో 225 పొగాకు బేళ్లు కొనుగోలు చేసినట్లు వేలం కేంద్ర ఇన్‌చార్జి బి.కోటేశ్వరరావు తెలిపారు. అలవలపాడు క్లస్టర్ పరిధిలో మొత్తం 241 పొగాకు బేళ్లు వేలం కేంద్రానికి రాగా 225 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేసి 16 బేళ్లను తిరస్కరించారు. వేలంలో గరిష్ట ధర రూ.వ200, కనిష్ట ధర రూ.190 పలికింది.

కందుకూరు: పొగాకు వేలంలో ధర రూ.200 వద్ద మార్కెట్ స్థిరంగా కొనసాగుతుంది. బుధవారం వేలంలో కందుకూరు-1వ వేలం కేంద్రంలో 641 బేళ్లను వేలానికి ఉంచగా 603 బేళ్లు, కందుకూరు-2 వేలం కేంద్రంలో 567 బేళ్లు ఉంచగా 527 బేళ్లు అమ్ముడుపోయాయి. అత్యధిక ధర రూ. 200 లభించగా, కనిష్ట ధర వరుసగా రూ.195, రూ.185 వచ్చాయి.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 782 బేళ్లు కొనుగోలయ్యాయి. ఆలకూరపాడు, అనంతవరం, జయవరం, పాలేటిపాడు, రావివారిపాలెం గ్రామాల రైతులు 842 బేళ్లను వేలానికి ఉంచగా 44 తిరస్కరణకు గురయ్యాయి. గరిష్ట ధర కేజీ రూ.200, కనిష్ట ధర రూ.170, సరాసరి ధర రూ.197 పలికింది. వేలంలో 11 మంది కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

బత్తాయి రైతుకు మంచు దెబ్బ



రాలిన పూత



పూతతో ఉన్న బత్తాయి చెట్లు

- ప్రారంభ దశలోనే రాలుతున్న పూత
- దిగుబడి తగ్గడంతో ఎగుమతులపై తీవ్ర ప్రభావం
- నిలకడలేని మార్కెట్‌తో డీలా పడుతున్న బత్తాయి రైతు
- రాలుతున్న బత్తాయి రైతు ఆశలు

పీసీపల్లి: పశ్చిమ ప్రకాశంలో పండ్లతోటలకు మార్కాపురం, యర్రగొండపాలెంల తరువాత కనిగిరి ప్రసిద్ధి చెందినదిగా పేరుంది. కనిగిరి నుంచి దేశంలోని ముంబయి, కలకత్తా, ఢిల్లీ, హైదరాబాద్‌లకు బత్తాయి, నిమ్మకాయలను ఎగుమతి చేసేవారు. కొంతమంది వ్యాపారులు నేరుగా వచ్చి పంట ప్రారంభంలోనే కొనుగోలు చేసేవారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. కారణం మార్చి నెల వచ్చినా మంచు పడుతుండడంతో వచ్చిన పూత ప్రారంభ దశోనే నేలరాలిపోతుంది. దీంతో నాణ్యమైన పంట చేతికి రాదేమోనని అటు వ్యాపారులు, ఇటు రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాలిపోతున్న పూత

నియోజకవర్గ పరిధిలో కనిగిరి మండలంలో 500, హనుమంతునిపాడు 50, వెలిగండ్లలో 200, పామూరు 590, సీఎస్‌పురం 490, పీసీపల్లి 750 హెక్టార్లలో బత్తాయి తోటలు సాగులో ఉన్నాయి. వీటిలో 35 శాతం తప్పితే మిగతా పంట అంతా మంచు దెబ్బకు పూత రాలిపోతుంది. వేసవి కాలం సమీపిస్తున్నా మంచు తగ్గకపోవడంతో ఈ ఏడాది దిగుబడిపై ఆందోళన చెందుతున్నారు. వాతావరణం తగ్గట్లు వ్యవసాయాధికారుల సూచనలు పాటించకుండా రైతులు రసాయన సంబంధిత ఎరువులైన నైట్రోజన్ సంబంధిత ఎరువులు వాడుతున్నారు. బత్తాయి పంట సాగు దశలలో ఉద్యానవన శాఖాధికారుల సూచనలు, జాగ్రత్తలు పాటించాలి. లేకపోతే నష్టవాటిల్లక తప్పదు.

హెచ్చుతగ్గుల ధరలతో అయోమయంలో రైతు

గత ఏడాది టన్ను బత్తాయి రూ. 20వేలు పలుకగా కనిగిరి నుండి దేశంలో మెట్రోపాలిటన్ నగరాలకు సుమారు 10 నుండి 20 లారీ ల వరకు ఎగుమతి అయ్యేవి. అయితే జులై ఆఖరకు రేటు బాగా పెరిగింది. అప్పటికి రైతుల దగ్గర ఉన్న బత్తాయి పంటలను అప్పటి రేటుకే అమ్మేశారు. క్రమంగా ప్రభుత్వం కూడా ప్రోత్సహించడంతో 8800 హెక్టార్లతో పాటు మరో 200 హెక్టార్లలో కూడా పంటను సాగు చేశారు. కాని రాను రాను వాతావరణ పరిస్థితులు పంటలకు వ్యతిరేకంగా మారడంతో పంట ప్రారంభదశలోనే పూత రాలిపోతుంది. మార్కెట్ అనుకూలంగా ఉందనే ఉద్దేశంతో పంటను సాగు చేస్తే గత ఏడాది వచ్చిన రాబడి కన్నా కనీసం 50 శాతం రాబడి అయినా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

రసాయన ఎరువులతో పంటకు నష్టం: రమేష్, ఉద్యానవన శాఖాధికారి

వాతావరణ మార్పులు కూడా పంటలపై ప్రభావం చూపుతుంది. దీంతో పాటు రైతులు బత్తాయిని సాగు చేసేటప్పుడు నైట్రోజన్ సంబంధిత ఎరువులు వాడుతున్నారు. వీటి వల్ల పంటకు మేలు జరుగకుండా నష్టం వాటిల్లే ప్రమాదముంది. పండ్ల తోటల కోసం కాంప్లెక్స్ ఎరువులైన 20-20, 19-045 ఎరువులను వాడాలి. బత్తాయిలో మొగ్గదశ, పచ్చిపూత దశ, తెల్లపూత దశ, పిందె దశల్లో రైతులు మెళకువలు పాటించాలి. ఉదయం, సాయంత్రం వారానికి రెండు నీటితో తడిపితే మంచిది.

బత్తాయి మార్కెట్లు ఏర్పాటు చేయాలి



రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ఈ ప్రాంతంలో మార్కెట్లు ఏర్పాట్లు చేయాలి. మార్కెట్ ఏర్పాటు చేస్తే నిమ్మ, బత్తాయి పంటకు మెరుగైన ధర లభించే అవకాశముంది.

– భూమిరెడ్డి కొండారెడ్డి , ఎంపీటీసీ

వాతావరణం అనుకూలంగా లేదు



ప్రభుత్వం పండ్ల తోటలకు చేయూతనిస్తుండడంతో కొత్తగా 5 ఎకరాల్లో బత్తాయి తోట చేశాను. వాతావరణం చూస్తే అనుకూలించడం లేదు. వేసవిలో కూడా కష్టపడి మొక్కలను బతికించుకుంటున్నాను. కాపు దశకు వచ్చే సరికి వాతావరణం అనుకూలిస్తుందోలేదోనని ఆందోళనగా ఉంది.

– మేకల బాలగురవయ్య, పెదయిర్లపాడు

అన్ని గ్రామాల్లో పనులు చేపట్టాలి



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ

లింగసముద్రం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేపట్టాలని ఏపీఓ అబ్దుల్లా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి రోజు 3 వేల మంది కూలీలు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గుడ్లూరు: ఉపాధి హామీ పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి సమీక్షించారు. ఉపాధి పనులకు వచ్చే ప్రతి కూలి బ్యాంకు ఖాతాను ఆధార్ నంబర్‌కు అనుసంధానం చేయాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్‌లు ప్రతి రోజు పనులను పర్యవేక్షించాలన్నారు. ఏపీఓ వినయ్, ఈసీ వెంకటేశ్వర్లు, టీఏలు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఎంపీడీఓ ఏ కృష్ణారావు అన్నారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఎఫ్ఏలు, టీఏలకు సమీక్ష నిర్వహించారు. ఇచ్చిన కొలత ల ప్రకారం పనిచేస్తే గిట్టుబాటు కూలి వస్తుందన్నారు. ఏపీఓ వెంకటేశ్వర్లు, ఈసీ శరత్, టీఏలు పాల్గొన్నారు.

సీఎస్‌పురం: గిట్టుబాటు కూలి వచ్చేలా కూలీలు పని చేయాలని ఎంపీడీఓ ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని కె. అగ్రహారంలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను తనిఖీ చేశారు. ఏపీఓ సుబ్బారావు, టెక్నికల్ అసిస్టెంట్ శేషయ్య ఉన్నారు.

సబ్‌స్టేషన్‌ల ఏర్పాటుకు హామీ



ఎస్ఈకి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

పామూరు: మండలంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు సబ్‌స్టేషన్లు నిర్మిస్తామని విద్యుత్ శాఖ ఎస్ఈ డి.సత్యనారాయణ హామీ ఇచ్చారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి తెలిపారు. ఒంగోలులోని ఎస్ఈని కలిసి మండలంలో విద్యుత్ సమస్యలపై వివరించారు. దీనిపై స్పందించిన ఎస్ఈ సత్యనారాయణ మండలానికి రెండు నూతన సబ్‌స్టేషన్లు మంజూరు చేస్తామని, నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్‌లైన్ల మరమ్మతులకు రూ.50 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. వైఎస్సార్ సీపీ యూత్ మండల అధ్యక్షుడు, ఉపసర్పంచ్ యాదాల వెంకట సాయికిరణ్, కోఆప్షన్ షేక్.నాయబ్‌రసూల్, సచివాలయ మండల కన్వీనర్ షేక్.ఖాదర్‌బాషా, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



టంగుటూరు జూనియర్ కాలేజీ వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

కొండపి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన తెలుగు, సంస్కృతం, జీఎఫ్‌సీ పరీక్షలకు 325 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. 14 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. ఆలస్యంగా వచ్చిన ఇద్దరు విద్యార్థులను పరీక్షకు అనుమతించలేదన్నారు.

సింగరాయకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 41 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ జి.రాధారాణి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 253 మందికి గాను 226, గురుకుల పాఠశాలలో 201 మందికి గాను 187 మంది హాజరయ్యారని వివరించారు. గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం తొలిరోజు పరీక్షకు రెండు కేంద్రాల్లో 457 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు.

కందుకూరు రూరల్: కందుకూరులో నాలుగు కేంద్రాల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 437 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 19 మంది గైర్హాజరయ్యారు. నారాయణ జూనియర్ కళాశాలలో 360 మంది విద్యార్థులకు గాను 22మంది, గాయత్రి జూనియర్ కళాశాలలో 483 మందికి గాను 21 మంది, వివేక జూనియర్ కళాశాలలో 470 మందికి 18 మంది గైర్హాజరయినట్లు పరీక్షా కేంద్రాల చీఫ్‌లు సుబ్బారావు, రవీంద్ర, మాధవరావు, లావణ్యలతలు తెలిపారు.

ఉలవపాడు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రారంభం అయ్యాయి. 140 మంది హాజరు కావాల్సి ఉండగా 10 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

కనిగిరి రూరల్: ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని 5 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 246 గాను 239 మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. ఎంఎస్ఆర్ కేంద్రంలో 295 మందికి గాను 22 మంది గైర్హాజరుకాగా, ఎంఎస్ఎం కేంద్రంలో 434 మందికి గాను 64 మంది గైర్హాజరు, కృష్ణ చైతన్య కళాశాల కేంద్రంలో 237 మందికి గాను 16 మంది, నేతాజీ కేంద్రంలో 208 మందికి గాను 7 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

పామూరు: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సర వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 719 మంది విద్యార్థులకు గాను 46 మంది విద్యార్థులు గైర్హాజరుగా 673 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు.

టంగుటూరు: స్థానిక పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు 229 మందికి 222 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

సింగరాయకొండ: ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వృద్ధురాలికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం మధ్యాహ్నం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం పాకలకు చెందిన వడ్డమూడి సీతమ్మ(60) ఆరోగ్య పరీక్షలు చేయించుకునేందుకు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చింది. తిరిగి పాకల వెళ్లేందుకు ఆటో స్టాండ్ వద్దకు వచ్చే క్రమంలో సీతమ్మను విజయవాడ నుంచి ఉదయగిరి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలులోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఉరేసుకొని వృద్ధుడు ఆత్మహత్య

గుడ్లూరు: అనారోగ్య సమస్యలతో వృద్ధుడు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని దారకానిపాడులో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..వడ్డెరపాలెంలో నివాసముండే తన్నీరు నరసింహం(75)కు ముగ్గురు కుమారులు ఉన్నారు. భార్య మూడేళ్ల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి చిన్న కుమారుడు వద్ద ఉంటున్నాడు. కొంతకాలంగా నరసింహం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ప్రసాదరెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడమే లక్ష్యం



మాట్లాడుతున్న కార్యదర్శి శ్రీనివాసులు

కందుకూరు: రైతులు పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులకు సరైన మార్కెట్ కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. స్థానిక ఏఎంసీ ఆవరణలో బుధవారం జరిగిన ధరల స్థిరీకరణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ పంటకైనా మద్దతు లభించనట్లైతే ప్రభుత్వమే స్వయంగా చర్యలు తీసుకుంటుందని, ధరల స్థిరీకరణ లక్ష్యమిదేనని చెప్పారు. ఈ-ఫారం మార్కెటింగ్ ద్వారా మద్దతు ధరల కంటే అధిక ధరలు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉలవపాడు మండలంలోని కరేడు, అలగాయపాలెం, చెన్నాయపాలెం తదితర గ్రామాల్లో పండించే వేరుశనగకు మంచి ధరలు ఇప్పించేలా వ్యాపారులతో చర్చించినట్లు చెప్పారు. అలాగే కందుకూరు, ఉదయగిరి, ఆత్మకూరు మార్కెట్‌యార్డులను రెగ్యులేషన్ మార్కెట్‌యార్డులుగా తీర్చిదిద్దేందుకు మార్కెటింగ్‌శాఖ కృషి చేస్తుందన్నారు. దీనిపై ఇప్పటికే ప్రాజెక్టు రిపోర్టును తయారు చేసి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీని వల్ల రైతులే స్వయంగా తమ ఉత్పత్తులను నేరుగా మార్కెట్‌యార్డు తీసుకుని వస్తే నేరుగా వ్యాపారులు వచ్చి వేలంపాట ద్వారా కొనుగోలు చేస్తారని చెప్పారు. వేలంపాటలో కార్పొరేట్ కంపెనీలైన రిలయన్స్, మోర్, డీమార్ట్ వంటి ప్రతినిధులతో పాటు, స్థానిక వ్యాపారులు పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వ్యవసాయశాఖ ఏడిఏ శేషగిరిరావు, ఉద్యానవనశాఖ అధికారి బ్రహ్మసాయి పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ



కాలిపోయిన ఇళ్లను పరిశీలిస్తున్న డాక్టర్ వెంకయ్య, బాలినేని వెంకటేశ్వరరెడ్డి

టంగుటూరు: మండలంలోని కొణిజేడు ఎస్టీ కాలనీలో మూడు గుడిసెలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా బుధవారం ఉదయం కాలిపోయాయి. బాధితులను పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పరిశీలించారు. వారికి సొసైటీ అధ్యక్షులు బాలినేని వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. మూడు జిల్లాల బీసీ అనుబంధ విభాగాల జోనల్ ఇన్‌చార్జి బొట్ల రామారావు, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ బొడపాటి అరుణమ్మ, ఎంపీటీసీలు బుర్రా అంకరాజు, దేవరపల్లి వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

కందుకూరు: పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ మస్తానయ్య కోరారు. ఆన్‌లైన్ దరఖాస్తులను స్థానిక పాలటెక్నిక్ కాలేజీ ద్వారా చేసుకోవచ్చన్నారు. విద్యార్థులకు వచ్చే నెల 16వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు.

ఆర్‌బీకేల్లో శనగల కొనుగోలు

మద్దిపూడి: మండలంలోని చిమట, మద్దిపూడి రైతు బరోసా కేంద్రాలల్లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శనగల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ తెలిపారు. ప్రభుత్వం క్వింటా శనగలకు రూ.5,330 మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



హనుమంతునిపాడులో మాట్లాడుతున్న ఎంపీపీ గాయం సావిత్రి

హనుమంతునిపాడు: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీపీ గాయం సావిత్రి అన్నారు. స్థానిక ఆస్పత్రి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భ,గా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రికి అవసర మైన మందులు కమిటీ ద్వారా తీర్మానించి కొనుగోలు చేయాలన్నారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తహసీల్దార్ ఎస్.హరిబాబు, ఎంపీడీఓ ఎం. క్రిష్టారావు, డాక్టర్ మూరక ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ కత్తిరాజారావు, సీహెచ్‌ఓ కేవీ చెన్నయ్య పాల్గొన్నారు.

సీఎస్‌పురం: వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. వైద్యశాలలో సిబ్బంది, మందుల వివరాలు, వైద్యశాల ద్వారా అందిస్తున్న సేవల గురించి సమీక్షించారు. ఎంపీడీఓ ఈశ్వరమ్మ, వైద్యులు ఎస్ మురళి, సర్పంచ్ శ్రీరాం పద్మావతమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ బుజ్జి, సేవాదళ్ మండల అధ్యక్షుడు పులి రామచంద్రారెడ్డి, ఆంటోని పాల్గొన్నారు.

సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

సీఎస్‌పురం: సచివాలయ సిబ్బంది, వలంటీర్లు బాధ్యతగా పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా అందించాలని మండల ప్రత్యేకాధికారి విద్యాసాగర్ అన్నారు. సీఎస్‌పురం 1, 2 సచివాలయాల సిబ్బందికి, ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ అందించాలన్నారు. ఎంపీడీఓ ఈశ్వరమ్మ, సర్పంచ్ శ్రీరాం పద్మావతమ్మ, పంచాయతీ కార్యదర్శులు రామప్రసాద్, వాణి పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి



మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్, పక్కన కమిషనర్ నారాయణరావు

కనిగిరి రూరల్: పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. కమిషనర్ డీవీఎస్ నారాయణరావుతో కలిసి బుధవారం శానటరీ సెక్రటరీలతో కలిసి సమావేశం నిర్వహించారు. పారిశుధ్య సమస్యపై ఫిర్యాదులు వస్తున్నాయని, శానిటరీ సెక్రటరీలు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు. తొలుత 12వ వార్డులో కౌన్సిలర్ శ్రీరాం సతీష్‌తో కలిసి పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు.

వినికిడి యంత్రం పంపిణీ

టంగుటూరు: మండలంలోని ఎం.నిడమానూరు గ్రామానికి చెందిన తల్లపనేని ఆంజనేయులుకు బుధవారం జెడ్పీటీసీ మన్నం అరుణకుమారి చేతుల మీదుగా వినికిడి యంత్రం పంపిణీ చేశారు. వినికిడి సమస్యతో బాధపడుతున్నట్లు వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబుకు తెలియజేయగా జిల్లా అధికారులతో మాట్లాడి యంత్రం మంజూరు చేయించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బీనీడి ఉదయకుమార్, వాకా బాలకృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వల్లంరెడ్డి రమణారెడ్డి, వైస్ సర్పంచ్ కాకుమాని సుబ్బారావు, పిడుగురాళ్ల స్వామినాథ్, మన్నం వెంకయ్య, స్వర్ణ శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణకు కృషి చేయాలి

కనిగిరి రూరల్: క్షయా వ్యాధి నివారణలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ సృజన అన్నారు. మండలంలోని పునుగోడులో బుధవారం నిర్వహించిన గ్రామ హెల్త్ మేళాను ప్రారంభించారు. మాచవరం మెడికల్ అధికారి డాక్టర్ జి.స్వప్న, 108 వెహికల్ అధికారి డాక్టర్ ఎం కేశవరావు, టీబీ యూనిట్ అధికారి బాబు రావు, సీహెచ్‌ఓ మౌనిక, ఏఎన్ఎం ఉషా, బాల శ్రీను, 104 సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సింగరాయకొండ: క్షయ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స చేయించుకుంటే ప్రాణాలు కాపాడుకోవచ్చని క్షయ వ్యాధి నివారణ విభాగం సూపర్‌వైజర్ షేక్ నిస్సార్ పేర్కొన్నారు. మండలంలోని కలికవాయ ఆరోగ్య కేంద్రంలో బుధవారం టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండు వారాలకు మించి జ్వరం, దగ్గుతోపాటు బరువు తగ్గుతుంటే తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్‌ఆలీ, సీహెచ్‌ఓ అనూష, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

సింగరాయకొండ: స్థానిక బాలయోగినగర్‌లో ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసుపై బుధవారం ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు విచారణ చేపట్టారు. గుడి స్థలం ఆక్రమించి అక్రమ కట్టడాలు చేపట్టానన్న ఆరోపణపై బాలయోగినగర్ కు చెందిన ఎస్.హర్షారెడ్డి మరో ఆరుగురు జనవరి 17వ తేదీన తన మీద దాడి చేసి కులం పేరుతో దూషించారని దావులూరి ఆదాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఫిబ్రవరిలో కేసు నమోదైంది. డీఎస్పీ విచారణ చేపట్టారు. ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా, ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా ఉన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు వాల్‌క్లాక్‌లు బహూకరణ

సీఎస్‌పురం: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు దాతలు బుధవారం వాల్‌క్లాక్‌లు బహూకరించారు. మండలంలోని ముండ్లపాడు గ్రామస్తుడు వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండల కార్యదర్శి పులి రామచంద్రారెడ్డి బ్రదర్స్ వాల్ క్లాక్‌లను బహూకరించారు. ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు చేతుల మీదుగాకార్యాలయాల అధికారులకు అందజేశారు.